# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- 'పచ్చదనం - ప్రాణహితం' కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ రోజు ప్రారంభించారు.
- రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.
- ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.
- రాష్ట్రంలో 2030 నాటికి హెచ్ఐవీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్నదే ప్రధాన లక్ష్యమని 'ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సిరి పేర్కొన్నారు.
- ఫెంగల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

======================

'పచ్చదనం - ప్రాణహితం' కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా తొలి దశలో 300 మొక్కలను నాటుతున్నామన్నారు. అలాగే ఒక్కో గ్రామానికి 400 వరకు మొక్కలు కేటాయిస్తున్నామని తెలుపుతూ....

(వాయిస్ 25 సెకన్లు)

======================

రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. విజయవాడలో ఈరోజు మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... 12 వేల 800 కోట్ల రూపాయలతో

ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తున్నామని అన్నారు. పేదలకు అందించే బియ్యాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో వ్యవస్థలను మార్చడానికి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గత జూన్ చివరి వారంలో కాకినాడలోని 13 గిడ్డంగులను తనిఖీ చేశామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యంలో 25 వేల టన్నుల ప్రజా పంపిణీ బియ్యాన్ని గుర్తించి, గిడ్డంగుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని వెల్లడించారు. రేషన్ బియ్యం విషయంలో కాకినాడ పోర్టుపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.

======================

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఈరోజు ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరించారు. ఈ సందర్భమగా ఆయన మాట్లాడుతూ, పింఛన్లు, గృహాలు, డ్రైన్లు, రహదారుల నిర్మాణం కోసం పెద్ద ఎత్తున వినతులు అందాయని తెలిపారు. జనవరి నెల నుంచి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని అన్నారు. నూతన ఇళ్లు, కొత్త పింఛన్లు కోసం అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు అర్హులంతా తమ వివరాలను అందజేయాలని, వాటిని యాప్ లో నమోదు చేసుకుంటారని మంత్రి తెలియజేశారు.

======================

ఫెంగల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు తిరుమలలో ప్రధాన జలాశయాలు నిండాయి. గోగర్భం జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ జలాశయాల్లో నీటిమట్టం పూర్తి స్థాయికి చేరింది. అన్నమయ్య జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రైల్వేకోడూరు సమీపంలో గుంజన నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. తుపాను ప్రభావంతో ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. దీంతో 20 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. కార్తిక మాసం ముగింపు నేపథ్యంలో భక్తులు సముద్ర స్నానాలకు వెళ్లొద్దని మెరైన్ పోలీసులు సూచించారు. అలాగే విశాఖ నుంచి పలు విమాన సర్వీసులు, విశాఖ, తిరుపతి విమాన సర్వీసులను రద్దు చేశారు. మరోవైపు చెన్నైలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండటంతో విశాఖ-చెన్నై విమాన సర్వీసులను కూడా రద్దు చేసినట్లు విశాఖ విమానాశ్రయ అధికారులు తెలియజేశారు.

విరామం

======================

రాష్ట్రంలో 2030 నాటికి హెచ్ఐవీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్నదే ప్రధాన లక్ష్యమని 'ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ' (ఏపీశాక్స్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సిరి అన్నారు. ఆ దిశగా శాక్స్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 3 లక్షల 25 వేల మంది హెచ్ఐవీ బాధితులుండగా, 2 లక్షల 75 వేల మందిని మాత్రమే గుర్తించామని, మిగిలిన వారు తక్షణం పరీక్ష చేయించుకుని, చికిత్స ప్రారంభించాలని ఆమె కోరారు. భవిష్యత్ తరాలకు ఈ వ్యాధి సంక్రమించకుండా అందరు కృషి చేయాలని సూచించారు.

======================

హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నూరు శాతం నివారించే వీలున్న వ్యాధి అని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని విశాఖపట్నానికి చెందిన ప్రముఖ వైద్యులు, అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ సభ్యులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2030 నాటికి ఎయిడ్స్ రహిత ప్రపంచాన్ని సాధించేందుకు అనేక ఆధునిక చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని వివరిస్తూ.....

(వాయిస్ 19 సెకన్లు)

======================

తిరుపతి స్థానికులకు శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనం కల్పించాలని ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనం కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఏర్పాట్లు చేసింది. డిసెంబరు 3వ తేదీ స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నారు. రేపు తిరుపతిలోని మహతి ఆడిటోరియం, తిరుమలలోని బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో దర్శన టోకెన్లను ఉచితంగా జారీ చేయనున్నామని టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలియజేసింది.

======================

ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశం ఈ నెల 3న నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ నెల 4వ తేదీన జరగాల్సిన మంత్రి వర్గ సమావేశాన్ని ఈ నెల 3వ తేదీకి మారుస్తూ.. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

======================

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులోని తిమ్మరాజుపాలెం గ్రామంలో అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపోహలు వీడి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులలో మనోధైర్యాన్ని నింపాలన్నారు.

హెచ్ఐవితో జీవిస్తున్న వారిని ప్రేమతో ఆదరించాలని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన ఎయిడ్స్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసా నివ్వాలని, వారిలో ఆత్మ విశ్వాసం పెంచాలని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. ఈరోజు కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎయిడ్స్ పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని నిరోధించగలమని అన్నారు. ఇక అల్లూరి సీతారామరాజు జిల్లా లో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో పాడేరులో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

======================

పార్వతీపురం మన్యం జిల్లాలో కౌమార బాలికల పథకం (SAG)ను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు SAG పథకంపై పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు.

======================

======================